## వైజ్ఞానిక కథల పోటీలో మొదటి బహుమతి పొందిన

వైజ్ఞానిక కథ



"అరే! అప్పుడే ఏడు గంటలయ్యిందే!"

ఆపరేషన్ థియేటర్ నుండి బయటకు వస్తూనే వాచీ చూసుకుని, కుర్చీలో అలసటగా కూలబడుతూ అన్నాడు డాక్టర్ వర్మ, నాప్‌కిన్‌తో నుదుట స్వేద బిందువుల నద్దుకుంటున్న డాక్టర్ వనితతో.

కుర్చీలో వెనుకకు వాలి అలసట తీర్చుకుంటూ తృప్తిగా నవ్వింది వనిత. శ్రమ అయినా ఒక ప్రాణిని కాపాడగలిగామనే తృప్తి, సంతోషమూ ఉన్నాయి ఆ నవ్వులో.

"మీకు బాగా లేటయినట్లుంది. ఇంటికి వెళతారా? మీ వారు ఎదురు చూస్తుంటారేమో? పోస్ట్ ఆపరేటివ్ కేర్ నే చూసుకుంటాలెండి..." గృహిణిగా ఆమె బాధ్యతలను అర్థం చేసుకున్న మిత్రుడిగా అన్నాడు వర్మ.

# స్త్రీ పర్వం



ఉలిక్కి పడింది వనిత. "...భలే గుర్తు చేశారు. మే మివాళ మ్యాటినీ కెళదామని ప్రోగ్రాం వేసుకున్నాం. మర్చేపోయాను థాంక్యూ" అంటూనే చెప్పులలో కాళ్ళు దూర్చి, ఏప్రాన్ భుజాన వేసుకుంటూ లేచి నిలబడింది. రెండడుగులేసి "సీ యూ టుమారో గుడ్‌నైట్" అంటూనే గబగబా మెట్లు దిగి తన కారు కేసి నడిచింది.

సరిగ్గా పదిహేను నిముషాలలో తన బంగళా పోర్టికోలో కారాపి, హుషారుగా లోనికి నడుస్తూ భర్త ఆఫీస్ రూంలోకి చూసింది. ఆమె రాకను గమనించనంతగా తన పనిలో మునిగి ఏదో రాసుకుంటున్నాడు కృష్ణ.

లోని కడుగిడగానే పనిపిల్ల చెప్పింది 'అయ్యగారు బాగా కోపంగా ఉన్నారమ్మా' అంటూ. తనలో తానే నవ్వుకుంటూ తన గదికేసి కదిలింది వనిత. కృష్ణ ఆ నగరంలో మంచి పేరున్న లాయర్. ఎప్పుడూ ఏదో పనితో సతమత మైపోతుంటాడు. ఇద్దరూ ఏదో ఒక ప్రోగ్రాం వేసుకోటం, ఎవరో ఒకరికి పని తగిలి అది విఫలం కావటం, రెండో వారు అలగటం, కాసేపాగి సర్దుకుపోవటం వారిద్దరికీ అలవాటే. అందుకనే పనిపిల్ల చెప్పిన మాటకు విలువ ఇవ్వకుండా నవ్వుకుంటూ బాత్‌రూంలో దూరింది వనిత.

ఏడెనిమిది గంటలయినా భర్త ఆఫీసురూం వదలక పోవటంతో తానే కదిలింది వనిత. వారిది ప్రేమ వివాహం. ఒకరి నొకరు బాగా అర్థం చేసుకుని ఉండటంతో వారి మధ్య ప్రణయ కలహాలు తప్ప పొర పొచ్చాలు లేవు.

"హాయ్, డియర్!" ఒక చేయి తలుపు కానించి నిలబడి భర్తకేసి చిలిపిగా చూస్తూ అంది వనిత. కృష్ణ తల పైకెత్తలేదు. కనీసం చూపు కూడా తిప్పలేదు. ఆమె ఉనికిని గమనించినా ట్యూబ్‌లైట్ వెలుగులో అతడి ముఖం కందగడ్డలా ఉంది కంది పోయి. జుట్టంతా చెదరి, కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఎంతో సేపట్నుండి ఉద్రేకాన్ని అణుచుకుంటున్నట్లుగా ముఖమంతా అలసటగా ఉంది.

"ఏమిటలా ఉన్నారు? ఆరోగ్యం బాగా లేదా?" దగ్గరికి వచ్చి నుదుటిపై చేయి ఉంచి అడిగింది వనిత. వెచ్చగా తగిలింది కృష్ణ ఫాల భాగం. విసురుగా చేయి ప్రక్కకు తోసేశాడు కృష్ణ.

"సారీ, డియర్...ఫర్ ది లేట్..." అతడి కోపాన్ని తగ్గించే ఉద్దేశంతో అంది వనిత. కృష్ణ మాట్లాడ లేదు. అతడి కోపస్థాయికి నిదర్శనంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువుగా ఉన్నాయి.






# రెంటాల నాగేశ్వరరావు

"ఏమిటి రాస్తున్నారు?" అతడి కోపం తగ్గించటం కోసం, సంభాషణ పొడిగిస్తూ అంది వనిత.

"విడాకుల పత్రాలు..." ఖంగున ధ్వనించింది కృష్ణ స్వరం.

"ఎవరివి? మనవేనా?" చిలిపిగా కృష్ణ జుట్టు చెరిపేసి నవ్వుతూ అంది వనిత. ఆమెకేసి సూటిగా చూశాడు కృష్ణ.

"ఒక వ్యక్తి ఒకామెను ప్రేమించి, పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కూడా అతన్ని ప్రేమించింది. వారి సంసారం హాయిగా నడుస్తోంది. కాని ఆమెకు పెళ్ళికి ముందే ఒక బిడ్డ ఉంది. అది తెలిస్తే అతడి మనసేమవుతుంది? ఆమె ప్రేమ నటన అని, ఆత్మీయత బూటకమని, పెళ్ళి స్వార్థం కోసమని అర్థమయితే అతడేం చేస్తాడు? అతడామెకు విడాకులివ్వటం తప్పు కాదనుకుంటాను. నీవేమంటావు?" తాపీగా అడిగాడు కృష్ణ.

"అదేం? ఆ విషయం ఆమె పెళ్ళికి ముందే చెప్పలేదా?" ఆసక్తిగా అడిగింది వనిత.

"లేదు కనుకనే అది మోసం అంటున్నాను. కాదా?" సూటిగా అడిగాడు కృష్ణ.

"అవును. అది మోసమే." మెల్లిగా అంది వనిత.

"అయితే నేను నీకు విడాకు లివ్వాలనుకోవటంలో తప్పు లేదనుకుంటాను." చూపు తిప్పుకుని అన్నాడు కృష్ణ.

కృష్ణ చెప్పేది అర్థం చేసుకోవటానికి సరిగా నిముషం పట్టింది వనితకు. ఆమె ముఖం కోపంతో జేవురించింది.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? ఇలాటి హీనమైన జోక్‌లను నేను సహించనని నీకు తెలుసు."

"నేను జోక్ చెయ్యలేదు. నిజమే చెబుతున్నాను." విడాకుల పత్రాలు ముందుకు తోస్తూ అన్నాడు కృష్ణ.

"ఏమిటా నిజం? పెళ్ళికి ముందు నేనో బిడ్డకు తల్లి నయ్యానా? నిన్ను మోసం చేసి పెళ్ళి చేసుకున్నానా?" కోపంతో ఆమె కనులు ఎర్రబారాయి. ఉద్రేకంతో తనూలత కంపిస్తోంది. "సంస్కారం మరిచి అలాటి మాట లనేందుకు నీవు సిగ్గుపడాలి, కృష్ణా!"

"ఇక బుకాయించకు, వనితా! నే చెప్పేదానికి ఆధారాలున్నాయి."

"ఏమిటా ఆధారాలు? చూపించు." విసురుగా అంది వనిత. టేబుల్ మీది ఒక కవర్ని వనితకేసి విసిరేశాడు కృష్ణ. గాలిలోనే అందుకుంది దానిని. గబగబా కవరు తెరిచి దానిలోని కాగితాలు బయటకు లాగి చదవటం ప్రారంభించింది.

ప్రొఫెసర్ పార్థసారథి
న్యూయార్క్, డి. పి.

"ప్రియమైన డాక్టర్ వనితకు,

నీవూ నీ భర్తా పిల్లలతో సుఖంగా ఉన్నావని ఆశిస్తాను. వివిధ దేశాలలో మెడికల్ కాన్ఫరెన్సులలో ప్రసంగించటానికిగాను సుమారు రెండు

సంవత్సరాలపాటు ప్రపంచ యాత్రకు బయలు దేరుతున్నాను. అందుచేత నీ బిడ్డ సంరక్షణా భారం వహించటం నాకు సాధ్యపడదు కనుక ఈ నెల పద్నాలుగున నీ బిడ్డను ఈవెనింగ్ ఫ్లైట్‌లో పంపుతున్నాను. ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకోవలసింది.

అప్పట్లో నీ బిడ్డ పేరు రాయలేదు కదా—'ఇందు' మిగతా వివరాలు 'ఇందు'తో. ఇందును గుర్తించటంకోసం ఆమె ఫోటోను జత పరుస్తున్నాను.

ఆశీస్సులతో,
పార్థసారధి."

గబగబా ఫోటో బయటకు తీసింది వనిత. అదో కార్డ్‌సైజు ఫోటో. దానిని చూడగానే ఒక్క క్షణం ఉలిక్కిపడి, సర్దుకుని మళ్ళీ పరీక్షగా చూసింది.

ఏడేళ్ళ పాప అందంగా నవ్వుతోంది ఫోటోలో. ఆ పాప ముఖంలో కొట్టొచ్చినట్లు వనిత పోలికలు కనిపిస్తున్నాయి. వనిత ఏడేళ్ళ వయసప్పు ఫోటోలా ఉందది! ఫోటో వెనుకవైపు 'ఇందు. డాటర్ ఆఫ్ డాక్టర్ వనిత' అని రాసి ఉంది. ఫోటోను మరీ మరీ చూసింది. ఆమెకు ఆశ్చర్యంగానూ, అయోమయంగానూ ఉంది. 'సందేహం లేదు. ఆమె తన కూతురు కాదని ఎవరూ అనలేరు' మనసులోనే అనుకుంది.

"హౌడ్యూ యూ సే డాక్టర్ వనితా!" వ్యంగ్యంగా పలికింది కృష్ణ స్వరం. "ఆమె నీ కూతురు కాదంటావా?"

"కాదు." స్పష్టంగా అంది. కాని గొంతులో ఏదో ఆదుర్దా ధ్వనించింది.

"నువ్వు కాలేజీలో చదివే రోజుల్లో పార్థసారథి నీ ప్రొఫెసర్ కాదూ?" సూటిగా ఉంది కృష్ణ ప్రశ్న. తీస్తే ఎన్నో అర్థాలు ధ్వనిస్తాయి దానిలో.

ఒక అర్థం తీసుకుని, విలవిల్లా కంపించింది వనిత.

"కాదూ?" రెట్టించాడు కృష్ణ.

"అవును. కానీ ఆయన నా తండ్రిలాంటి వారు." కృష్ణలోని అనుమానాన్ని తొలగించటానికి వృథా ప్రయత్నం చేస్తోంది వనిత. "ఈ పాప నా కూతురు కాదు...ఇది నిజం."

"కాదు—అబద్ధం" వృత్తిపరంగా వచ్చిన సంభాషణా దోరణే కృష్ణ మాటలలో పలికింది. "ప్రొఫెసర్ పార్థసారధి వయసులో చాలా పెద్దవాడు. వైద్య రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవాడు. వృత్తిపరంగా తప్ప మిత్రులకు కూడా ఉత్తరం రాసేంత తీరికలేని వాడు. ఎంతోమంది విద్యార్థులు తన కుండగా నీకుమాత్రమే 'నీ బిడ్డను పంపిస్తున్నాను' అని ఉత్తరం ఎందుకు రాస్తాడు? బిడ్డ నెందుకు పంపుతున్నాడు? ఆమె నీ కేవీ కాకుంటే—నీ పూర్తి పోలిక లెలా వచ్చినాయి? ఆయనలాంటి గొప్ప వ్యక్తి అబద్ధాలాడడనీ, ప్రాక్టికల్ జోక్స్ వేయడనీ నాకు తెలుసు."

వనిత అవాక్కయింది. కృష్ణలాంటి ప్రముఖ లాయర్‌తో వాదించడం అసాధ్యమని ఆమెకూ తెలుసు.

"అదికాదు...కృష్ణా" కొంచెం తెప్పరిల్లాక ఏదో మాట్లాడబోయింది వనిత.


"టెస్ట్ ట్యూబ్ బేబీ అని బుకాయించటానికి ప్రయత్నించకు. దానికీ ఎంబ్రియో పెరగటానికి తల్లి గర్భాశయమే శరణ్యమని నాకు తెలుసు. దానికి నీవు 'ఎగ్' డొనేట్ చేసి ఉంటే, దానిని భరించిన స్త్రీ నీకు తెలిసి ఉండాలి. ఆమె పేరు వెంటనే చెప్పగలవా?"

"పూ: హా:. అదేంకాదు" గొంతు పెగుల్చుకొని అంది వనిత.

"మరి? అమెరికాలో ఒక తెల్లని స్త్రీ నీగ్రో జనిస్తే భర్త అనుమానంతో విడాకులకోసం కోర్టు కెళ్ళాడు. కోర్టు శాస్త్రజ్ఞుల సాయం కోరితే, ఆమె బెడ్‌రూమ్‌లో నీగ్రో ఫోటో ఉందనీ, ఆమె అంతర్గతంగా అనుక్షణం ఆ నీగ్రో గురించే ఆలోచించేదనీ, దానివలన ఆమెకు నీగ్రో జనించాడనీ చెప్పారు వారు. దాంతో కేసు కొట్టేశారు. నీవూ అలాంటి పోలికే చూపాలనుకుంటున్నావా?" విసురుగా అన్నాడు కృష్ణ.

"అవ లలాటి వేవీ నేనే చెప్పబోవడం లేదు కోర్టులోలాగా ఇంట్లో ఆర్గ్యూ చేస్తారేం? అనవసరంగా విసిగిస్తారేం? ఈ బిడ్డ నాకు పుట్టలేదు. అదిమాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఏ ప్రమాణమైనా చేసి చెప్పగలను" నీరసంగా కుర్చీలో కూలబడి అంది వనిత టేబుల్‌పై తల వాల్చుతూ.

క్షణాలు అతి భారంగా గడుస్తున్నాయి. ఆమె స్త్రీత్వాన్నే భర్త శంకించటంతో కలిగిన ఉద్రేకంతో ఆమె నయనాలు జలపూరితాలయ్యాయి. శబ్దం కాకుండా హృదయం రోదిస్తోంది.




"వనితా! కొంచెం జాలిగా, బాధతో కూడిన కంఠస్వరంతో అన్నాడు కృష్ణ "తనని తానే నమ్మలేని వాళ్ళు మనసెరిగిన భార్యను కూడా శంకిస్తారు. రుజువు లేక తాము బాధపడుతూ, ఇతరులను బాధిస్తారు. నేనలాంటి నిత్య శంకితుడిని కాననే అనుకుంటాను. కాని రుజువు దొరికినా సహించి భరించగలిగే సన్యాసి మనస్తత్వం నాకు లేదు. ఉన్నా ఈ సంఘంలో అది అసమర్థతగా భావించబడుతుంది. పెళ్ళికి ముందే నీవు బిడ్డ తల్లివని తెలిసినా, నిన్ను వదులుకొని ఉండనేమో... కాని ఇదే నిజమైతే నీ ప్రేమంతా నటనకాక మరేమవుతుంది? అయినా నేను నిజాయితీని నిరూపించుకోటానికి ఒక నెల గడువిస్తున్నాను, నిరూపించుకుంటే ఎంతో సంతోషిస్తాను కూడా. నేనీ రాత్రికే పూనా వెళుతున్నాను. సరిగ్గా నెలకు వస్తాను. నిరూపించుకోగలిగితే నీవు ఇక్కడే ఉండు. లేకుంటే ఈ ఎడాకుల పత్రంపై సంతకం చేసి వెళ్ళిపో..'డబ్బాల్'' ఠక్కున లేచి, గబగబా తన గదికి వెళ్ళిపోయాడు కృష్ణ.

అలానే నిశ్చేష్టయై కూర్చుండిపోయింది వనిత.

అరగంటలో కృష్ణ వెళ్ళిపోతున్న బూట్ల శబ్దం వినిపించింది. అతడి నాపాలని ప్రయత్నించ లేదు వనిత. అతడు వెళ్ళిపోయాక, పార్థసారథికి ఓవర్‌సీస్ కాల్ బుక్ చేయటంకోసం ఫోన్ దగ్గరకు లాక్కుంది. కాని ఎంత ప్రయత్నించినా లైన్ దొరకలేదు.

• • • •


అది పద్నాలుగో తారీఖు.

జడ్జిమెంటుకోసం ఎదురు చూసే ముద్దాయిలా ఎదురు చూస్తోంది వనిత ఆ తేదీకోసం. గడిచిన మూడు రోజులు హాస్పిటల్‌కి వెళ్ళలేదు. అసలే పనీచేయలేదు. ఫోన్ దగ్గరే కూర్చున్నది లైన్ దొరికినా పార్థసారధి దొరకలేదు. సజీవంగా

ఉండే ఆమె మృదులా ధరాలు ఎండిపోయాయి చెక్కిళ్ళు కొంచెం పీక్కుపోయాయి. ఆమె విశాల నయనాలు ఎర్ర కలువ లయినాయి. మూడు రోజుల్లోనే ముప్పై ఏళ్ళ వయసు పైబడినట్లుగా తయారయింది వనిత.

ఇందు తన కూతురు కాదని ఆమె మనస్సాక్షికి తెలుసు. కాని ప్రొఫెసర్‌గారలా ఎందుకు రాశారో అర్థంకాలేదు. ఉయున్నెరిగన్న రీత్యా ఆయన రాసింది 'నిజమే'నని అనిపిస్తుంది ఆమెకు. కాని 'అదెలా సాధ్యం'? అనేదానికి ఆమెవద్ద సమాధానం లేదు. తన సంసారాన్ని భంగం చేయాలని ప్రొఫెసర్ కలలో కూడా భావించడని ఆమెకు బాగా తెలుసు కన్నకూతుర్లా ప్రేమిస్తాడామెను ఆ విషయమూ ఆమెకు తెలుసు మరి? మరెందుకిలా జరిగింది? విధి తన జీవితంతో ఎందుకాడుకుంటోంది? తన నిస్సహాయతకు ఆమె హృదయం రోదిస్తోంది. తన స్త్రీ జన్మపై వెగటుపుట్టేలా అసహ్యం వేసిందామెకు.

తన నర్థం చేసుకోలేని కృష్ణపై కూడా కోపం పెరుగుతోంది. అతడి ప్రవర్తనకు కారణం పురుషాహం కారమా?




కృష్ణకు మరో స్త్రీతో సంబంధం ఉందని తెలిస్తే తానువెంటనే విడాకులిస్తాను కదా అని ఉండేదా?

ఎందుకనలేదు?

తరతరాలుగా స్త్రీలో జీర్ణించుకుపోయిన బానిసత్వ లక్షణపు అవశేషమా?

విమానం వచ్చే టైమ్ కావటంతో ఎయిర్ పోర్ట్‌కి బయల్దేరింది వనిత. కారు వేగంగా సాగుతోంది. అంతకంటె వేగంగా ఆమె గుండె కొట్టుకుంటూంది. విషయం తెలియకపోవడంతో ఆందోళన ఎక్కువయింది. 'ఇందు' రాకతో ఆమె జీవితం గొప్ప మలుపు తిరగబోతోంది. పిచ్చిగా నవ్వుకుంది వనిత. తా నింతవరకు చూడని, తనకేమీ కాని ఓ ఏడేళ్ళ పాప తన జీవిత పథాన్ని మార్చబోతోంది...!

ఇదెక్కడి న్యాయం?

ఆక్రోశించింది ఆమె హృదయం.

ఎయిర్ పోర్ట్‌కి ఆమె చేరేసరికే విమానం లాండ్ అయి ఉంది. ప్రయాణీకు లొక్కరొక్కరే దిగుతున్నారు. నిర్లిప్తంగా ఎంట్రెన్స్ గేట్ దగ్గర నిలబడి వారికేసి చూస్తోంది వనిత. ఎందుకో ఆమె హృదయ స్పందన వేగం పెరిగింది.

అందరికంటె చివరగా ఎయిర్ హోస్టెస్‌తో పాటు మెట్లు దిగుతోందో పాప! వనిత ఒళ్ళు ఝల్లుమన్నది!

ఎయిర్ హోస్టెస్ తోడుగా సెక్యూరిటీ చెకప్ లోకి వెళుతూ, వనితను చూసి చేయూపింది ఆ పాప!

అది చూసి సంభ్రమానికి లోనై విశ్చేష్టిత అయింది వనిత. సందేహం లేదు. ఆ పాప ఇందునే! విశాల నయనాలు, పాలు గారే చెక్కిళ్ళు, తెల్లగా, అందంగా, ఆరోగ్యంగా ముద్దొచ్చేలా ఉంది.

పది నిముషాలలో సెక్యూరిటీ నుండి బయటకు వచ్చింది ఇందు, ఎయిర్ హోస్టెస్‌తో. ఇందు చూపగా వనిత కేసి వచ్చిం దామె.

''మీరు డాక్టర్ వనిత అనుకుంటాను ...'' యూనిఫారంలో హుందాగా చలాకీగా ఉన్న అమెరికన్ ఎయిర్ హోస్టెస్ పలకరించింది ఆంగ్లంలో.

అప్రయత్నంగా తలూపింది వనిత.

ఉత్సాహంగా దగ్గర కొచ్చి చేయి కలిపిం దామె.

''ఇందులాంటి చక్కని తెలివి తేటలు గల అమ్మాయిని కలిగి ఉన్నందుకు మీకు నా శుభాకాంక్షలు. ప్రొఫెసర్ గారు రాలేక నన్ను మీకు అప్పగించమన్నారు.''

ఆమె చెప్పేది వినకుండా ఇందుకేసి చూస్తోంది వనిత. ఓ అడుగు దూరంలో నిలబడి ఆమెకేసే చూస్తోంది ఇందు విస్ఫారిత నయనాలతో.

ఇందును దగ్గరగా చూశాక వనిత మదిలో తెలియని పులకరింత జనించింది. స్తనాలు పొంగాయి. హృదయం ఏదో ఆప్యాయతతో తపించింది. అప్రయత్నంగా చేతులు చాచింది.

ఒక్క పరుగున ఆమె గుండెపై వాలిపోయింది ఇందు. గట్టిగా హత్తుకుంది వనిత. నుదుటిపై, బుగ్గలపై, తలపై ఉద్రేకంతో ముద్దెట్టుకుంది. 'ఏ జన్మ బంధమో ఇది ... ఈ పాప తన కడుపున

దరిచేరింది. ఇదే నిజమైతే ఎంత ఆనందం ...' మన సులో అనుకుంది వనిత. ఆ పాపకోసం కృష్ణని, సర్వ ప్రపంచాన్ని వదిలేయవచ్చనిపించిం దా క్షణాన. అలానే వో నిముషం ఉండిపోయారు వారు. వారినే చూస్తూ ఉండిపోయింది ఎయిర్ హోస్టెస్.

"ఇందుని రిసీవ్ చేసుకున్నట్లుగా లెటర్ రాసి ఇవ్వండి" నెమ్మదిగా అందామె. వెంటనే హేండ్‌బాగ్ లోంచి లెటర్ పాడ తీసి గబగబా ప్రొఫెసర్‌కి లెటర్ రాసి ఇచ్చింది. ఆమెను కౌగలించుకుని మరీ థాంక్స్ చెప్పింది.

లెటర్ తీసుకుంటూ, "ప్రొఫెసర్ గారు మీకో లెటరిమ్మన్నారు" అంటూ వో లెటర్ ఇచ్చి, ఇందు జిప్ బాగ్ ఆమె చేతికిచ్చింది ఎయిర్ హోస్టెస్.

మరోసారి ఆమెకు కృతజ్ఞతలు తెలిపి ఇందుతో పాటు కదలింది వనిత. ఆమె పొందుతున్న సంభ్రమాశ్చర్యాలలో ఏ విషయాలూ ఆమె నడగటం మర్చిపోయింది వనిత.

"ప్రయాణం బాగా జరిగిందా?" ఇందు చేయి పట్టుకుని నడుస్తూ అడిగింది వనిత ఇందు. స్పర్శకు ఆమె తనువు పులకరిస్తోంది. సంభాషణ ఎలా ప్రారంభించాలో కూడా అర్థం కాక అలా అడిగింది.

తల వూపింది ఇందు.

"నన్నెలా గుర్తుపట్టావు?"

కారు డోర్ తెరచి ఇందుని కూర్చోబెట్టి, తిరిగి వచ్చి స్టీరింగ్ ముందు కూర్చుంటూ అడిగింది వనిత.

"ప్రొఫెసరంకుల్ నీ ఫోటో ఇచ్చారుగా!"

ఫ్రాక్ జేబులోంచి ఫోటో తీసి చూపిస్తూ అంది ఇందు.

అమెరికన్ యాక్సెంట్‌తో ఉన్న ఆ చిన్నారి ముద్దులొలికే తెలుగు పలుకులు విని ఆనందంతో పరవశించి పోయింది వనిత.

కారు స్టార్ట్ చేయబోతూ ఆగి, ప్రొఫెసర్ పంపిన లెటర్ తీసి చించింది వనిత.

"ప్రియమైన డాక్టర్ వనితకు—

ఆశీస్సులు.


ఇందుపు చూసి నీ విప్పుడు గర్విస్తూ ఉండవచ్చు. లేదా ఆందోళన పడుతూ ఉండవచ్చు. 'ఇందు నా బిడ్డ కాదు' అని నీవు మనస్ఫూర్తిగా నమ్మి ఉండవచ్చు. తనకు తెలియకుండా తనకో బిడ్డ కలిగిందంటే ఏ స్త్రీ నమ్మలేదు. కాని ఇది సత్యం. అలా నమ్మే మొదటి స్త్రీవి భారత దేశంలో నీవే అవుతావు!

అక్షరాలా ఇందు నీ బిడ్డే!!

ఈ నిజం నిన్ను గర్వాతిశయం కల్గింటి గొప్ప స్త్రీని చేస్తుంది. ఇందు తెలివి తేటలకు, చేష్టలకు, అందానికి మాత్రమేకాదు, ఆమె పుట్టుకతో నేటి విజ్ఞాన శాస్త్రంలో ఒక గొప్ప మలుపు అయినందుకు! భారతదేశం లాంటి అభివృద్ధి చెందే దేశాలలో, అరబ్ దేశాలలో, అభివృద్ధి చెందని దేశాలలో స్త్రీ కున్న విలువ ఏమిటో నీకు తెలుసు. ఒక బానిసగా, మగవాని విలాస వస్తువుగా సంతలో అంగడి బొమ్మగా సమాన హక్కులు లేక పురుషాహంకారానికి దాసోహ మంటున్నది స్త్రీ. అత్యాచారాలకు

గురవుతూ, పురుష శక్తికి లోబడి, పరదాలలో వంటింట్లో ఉంటూ వూడిగం చేస్తూ, ఆ పురుషులకే జన్మ నిస్తున్నది. అరబ్ దేశాలలో స్త్రీని నగ వాడు కొని బానిసను చేస్తే, మన దేశంలో స్త్రీయే పురుషుడ్ని కొని బానిస అవుతున్నది. సృష్టి కార్యంలో మగవానికంటె ఎక్కువ బాధ్యత భరిస్తూ, మానవజాతి మనుగడకే ప్రాణం పోసే స్త్రీ ఇంత హీన స్థితిలో ఉండటానికి కారణం ఏమిటి?

మనిషి డబ్బుని సృజించి దానికి బానిస అయ్యాడు. స్త్రీ మగవానికి జన్మనిచ్చి బానిస అయింది. డబ్బుని మనిషి నశింపజేయటం అసాధ్యం. కాని పురుషాహంకారాన్ని అణచగల అవకాశం విజ్ఞాన శాస్త్రం మన కిచ్చింది. పురుషుల అవసరం (వీర్యం కూడా) లేకుండానే సంతానోత్పత్తి జరిగిననాడు పురుషుల విలువ ఏపాటి? ఆ అహంకారానికి తావెక్కడ? అలాంటి ప్రక్రియ విజ్ఞానం సాధించింది. ఇందు జననం పురుష ప్రమేయం లేకుండా జరిగింది.




ఇందుకు నీవు తల్లివి కావు—తండ్రివి!

ఆశ్చర్యపోతున్నావా?

మెడికల్ జర్నల్స్‌తో నీకు బాగా పరిచయముండి ఉంటే నీవు అంతగా ఆశ్చర్యపోవేమో! అదెలాగో చెబుతాను.

'ప్రొఫెసర్‌గార్ని రాము డెవరని అడిగితే— రఘువంశం నుండి ప్రారంభిస్తారని' నా విద్యార్థులంటారని నీకు తెలుసు. నీవూ నా విద్యార్థివే గనుక నా అలవాటు తప్పకుండా అలానే చెబుతాను—కొన్ని నీకు తెలిసిన విషయాలైనా.

ఇందు జననం క్లోన్స్ పద్ధతిలో జరిగింది. సృష్టిలో మొట్టమొదటి జీవిగా చెప్పబడే "అమీబా" అనే ఏక కణ జీవిలో సంతానోత్పత్తి ఎలా జరుగుతుందో నీకు తెలుసు. కేవలం నిలువుగా రెండు సమ భాగాలుగా చీలి, రెండింటిగా మారిపోతుంది. ఈ లింగరహిత విభజనలో జనించే ప్రతి అమీబా అన్ని విధాల తన తల్లిని పోలి ఉంటుంది. పరిమాణంలో

ఉప్ప ఏ తేడ ఉండదు. ఇలా కార్బన్ కాపీలా ఏర్పడే వాటిని "క్లోన్స్" అంటారు. ఎంతో పరిణామం చెందిన మానవునిలో లింగ భేదం ఉన్నది. స్త్రీ బీజ కణము, పురుష వీర్య కణము కలిసి పిండోత్పత్తికి నాందిగా ఉండే మొదటి సంయుక్త కణం (జైగోట్) ఏర్పడుతుంది. ఈ కణంలో రెండు బీజకణాల్లో సగం ఉండే క్రోమోజోములు కలిపి "డిప్లాయిడ్" క్రోమోజోమ్స్ ఉంటాయి. ఈ సంయుక్త కణం "అమీబా" విభజన చెంది ఎన్నో "క్లోన్స్" కి జన్మనిస్తుంది. అయినప్పటికీ అన్నీ డిప్లాయిడ్ క్రోమోజోమ్స్ కలిగి ఉంటాయి. ఇలా కణాలు పెరిగేటప్పుడు "సెక్స్" పాత్ర లేదు. ఆ పుట్టబోయే బిడ్డ ఆడయినా, మగ అయినా! ఆ కణాలలో (సెల్స్) కొన్ని తాము నిర్వర్తించబోయే పనుల కనుకూలంగా ప్రత్యేక లక్షణాలు పెంపొందించుకుంటాయి. అంటే కన్నుగా మారే కణాలు ఒక రకంగా, చర్మంగా మారే కణాలు ఒక రకంగా, లివర్‌గా మారే కణాలు ఒక

రకంగా అన్న మాట! అలాగే బీజకణాల పెరుగుదల తరువాత జరిగినా, అవీ ఈ కణాలనుండే కదా జనించేది!

'జీవి శరీరంలోని ప్రతి కణమూ మొదట్లో పూర్తి "జెనెటిక్ కోడ్" ని కలిగి ఉంటుం'దనే సిద్ధాంతం మానవ క్లోన్స్ తయారుకి ఉద్బోధించింది.

నీవు మెడిసిన్ ఫోర్త్ ఇయర్‌లో ఉండగా వసు కుంటాను. అమెరికాలో చేపలలో క్లోన్స్ సృష్టించబడ్డాయి. తరవాత జపాన్‌లో కప్పలలో సృష్టించారు. దాంతో మానవ క్లోన్స్ తయారు చేయటానికి శాస్త్రజ్ఞులు పూనుకున్నారు. అప్పుడు అమెరికన్ సెనెట్‌లో గొడవ కూడా జరిగింది.

మన దేశంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలు, [illegible] చూసి, పురుషాహంకారం నశించాలంటే ఇక్కడ క్లోన్స్ తయారు కావటం [illegible] నిపించి [illegible] పరిశోధనలు

ప్రారంభించాను.

సరిగ్గా అప్పుడే ఓ మెడికల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనటానికి వచ్చిన డాక్టర్ మిస్ ఫ్రాన్సిస్ టేలర్ అనే అమెరికన్ క్లోన్‌కి తల్లి కావటానికి ఇష్టపడటంతో, నా పరిశోధనలు ముందుకు సాగాయి.

స్థిరమైన నైతిక విలువలు, చక్కటి నడవడిక, తెలివి తేటలు గల నిన్ను ఆ క్లోన్‌కి తండ్రిని చేద్దామనిపించింది. నీకు గుర్తుండే ఉంటుంది. అప్పట్లో ఐదారుసార్లు నీ చేతి చర్మం నుంచి కొన్ని కణాలు (పూర్తి జెనెటిక్ కోడ్ ఉన్న న్యూక్లియస్‌తోసహా) తీసుకున్నాను. మిస్ ఫ్రాన్సిస్ టేలర్ ఫాలోపియన్ ట్యూబ్ నుండి 'ఓవ్యులేషన్' జరిగిన వెంటనే 'ఎగ్'ని తీసి, దానిలోని న్యూక్లియస్ తీసివేసి, దానిలోకి నీ చర్మపు కణాన్ని 'ట్రాన్స్‌ప్లాంట్' చేశాను. అంతే.

ఆ ఎగ్ లోని సైటోప్లాజం తన పని ప్రారంభించింది. కేవలం కొద్ది సార్లు విభజన జరుగగానే దానిని మిస్ టేలర్ గర్భాశయంలో ప్రవేశ పెట్టడం జరిగింది. అది ఫలప్రదమయిన పిదప ఆమె అమెరికా వెళ్ళిపోయింది. పరిశోధన నిమిత్తం నేనూ ఆమెతోటే వెళ్ళాను. అమెరికాలో అప్పటికే క్లోన్స్‌కి సంబంధించి కొన్ని మెడికో లీగల్ కేసులు వచ్చాయి. దానితో మగవాడి పాత్రను ధరించే కణదాతను స్త్రీ అయినా, పురుషుడైనా తండ్రిగాను, 'ఎగ్' డోనర్‌ని తల్లిగాను అంగీకరించింది కోర్టు. దీనివల్ల ఎన్నో చిక్కు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందునా, లక్షలు ఖరీదుచేసే రోబోట్ కన్నా చౌకగా ఈ క్లోన్స్ తయారు ప్రారంభమయితే, మానవతా విలువలు దెబ్బతింటాయనే ఉద్దేశంతోనూ క్లోన్స్ సృష్టించి, వాటినుండి లివర్, గుండె, మూత్రపిండాల్లాంటి ముఖ్య భాగాలను కొందరు 'రిజర్వ్'లో ఉంచుకోవటానికి ప్రయత్నించటంవల్లా క్లోన్స్ పై పరిశోధనలు నిషేధించింది అమెరికన్ ప్రభుత్వం — చట్టపరంగా.

అందుచేత నేనీ విషయాన్ని గోప్యంగా ఉంచటం జరిగింది. అప్పుడు మిన్నిసోటా యూనివర్సిటీలో జెనటిక్స్, సెల్ బయాలజీలలో ప్రొఫెసర్ రాబర్ట్ మెకిన్నెల్ ప్రభుత్వంపై కోర్టుకు వెళ్ళాడు. కోర్టు ఆదేశం ప్రకారం ప్రభుత్వం లొంగి ప్రత్యేక పరిస్థితులలో నా టీమే ఈ రిసెర్చికి అనుమతించింది — పాతవాటి నంగీకరించి.

అంటే చట్ట రూపేణా నీవు ఇందు తండ్రివి. క్లోన్స్‌ని లాబ్‌లో స్పెసిమెన్‌గా, ఓ రోబోట్‌గా కాక మనిషిగా పెంచిన నాడు మన సంఘంలో పురుషాధిక్యం నశించి, సమానత్వం వస్తుందనుకుంటాను. దీనిని వివిధ దేశాల్లో నచ్చచెప్పి ఈ రిసెర్చిని ప్రోత్సహించాలని ప్రపంచ యాత్రకు బయల్దేరాను. నాతో ఇందు తల్లి — ఫ్రాన్సిస్ కూడా వస్తూండటంతో, ఇందుని నీ వద్దకు పంపవలసి వచ్చింది. అంతేకాక ఇందు ఓ మర బొమ్మలా కాక, పరిపూర్ణ మానవునిగా పెరగటానికి భారతీయ జీవన విధానం అత్యున్నతమైనది. అది నీ నుండి ఇందుకు పట్టుబడుతుందనేది నా ఆశ. ఈ టూర్ పూర్తి కాగానే, భారతదేశంలో క్లోన్స్‌పై రిసెర్చి నిషేధించబడలేదు కనుక, అక్కడే స్థిరపడి రిసెర్చి చేస్తాను.

నీ కిష్టం లేకుంటే — లేక వేరే కారణాలవలన ఇందును నీ బిడ్డగా అంగీకరించకపోయినా, నే రాగానే ఇందు బాధ్యతను స్వీకరించ గలనని హామీ ఇస్తూ —

అంతవరకు ఇందు సాహచర్యం నీకు ఆనందాన్ని ఇస్తుందని ఆశిస్తూ

ఆశీస్సులతో...

—పార్థసారధి.

లేఖ చదివి ఓ నిముషం అలానే కూర్చుండి పోయింది వనిత.

''డాడీ!'' ప్రేమగా పిలిచింది ఇందు.

స్త్రీ సహజంగా ఉండే మాతృ భావనతో, పితృ బాధ్యతతో వనిత ఒడలుప్పొంగాయి. కాల గమనంలో పురుషాహంకారపు చివరి అధ్యాయం పూర్తయి, స్త్రీ సర్వం మొదలైనట్లనిపించింది వనితకు ఇందును చూస్తుంటే!

ఇందును దగ్గరగా తీసుకుని హృదయంలో పొదువుకొని నుదుటిపై చుంబించింది వనిత మరు నిముషంలో కారు కదిలింది. ★

